క్లుప్తంగా

ఘనంగా మాతృభాషా దినోత్సవం



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తెలుగు అభ్యున్నతికి ప్రముఖులు చేసిన కృషిని వివరించారు. తెలుగు భాషను అందరూ ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. వైస్‌ప్రిన్స్‌పాల్ బి.దేవజయరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.వేదాంతం, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ హిమాలినీదేవీ, రైతు సంఘ నాయకులు జి.నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎల్. అజయ్‌ఘోష్, కె.శ్రీనివాసరావు, పి.ధనశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గూడూరు: కాలిన గాయాలతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిడుమోలు శివమ్మ(57) అనే మహిళ మృతి చెందిందని ఎస్ఐ వి.వెంకటేష్ మంగళవారం తెలిపారు. ఈనెల 1వ తేదీన భర్త, మరుదుల వేధింపులు తాళలేక శివమ్మ ఇంట్లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. గాయపడిన ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిరచారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పొద్దుపోయాక ఆమె మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారన్నారు. చికిత్స పొందుతూ శివమ్మ ఇచ్చిన వాంగ్మూలం మేరకు భర్త, మరుదులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెల్లడించారు.

ట్రాక్టర్‌పై వరిగడ్డి దగ్ధం



మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండల పరిధిలోని కుమ్మరిపాలెం వద్ద ట్రాక్టర్‌పై తీసుకెళుతున్న వరిగడ్డి దగ్ధమైంది. గ్రామం నుంచి అవనిగడ్డ వైపు వరిగడ్డి లోడుతో ట్రాక్టర్ కృష్ణా కరకట్టపై మంగళవారం వెళుతుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపివేశాడు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలంకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ట్రాక్టర్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. రెవెన్యూ అధికారి మోపిదేవి వెంకటేశ్వరావు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. సుమా రు రూ.5 వేలు నష్టం జరిగిందని తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరుకోటలో జరుగుతున్న పేకాట పై స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో పోలీసులు మంగళవారం దాడి చేశారు. స్థానికంగా కొంతమంది పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంపై సెబ్ సిబ్బంది దాడి చేయగా ఏడుగురు పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.7000 నగదును సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను మచిలీపట్నం పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన పేకాటరాయుళ్లను బుధవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు మచిలీపట్నం ఎస్ఐ రమేష్ బాబు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రయాణం ఇక సుఖమయం

- తుది దశకు కోడూరు–నాగాయలంక మధ్య రోడ్డు నిర్మాణం
- రూ.16 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు
- డబుల్‌లైన్ రోడ్డుగా విస్తరణ
- తీరప్రాంత ప్రజలకు దగ్గర కానున్న జిల్లా కేంద్రం



మందపాకల-పోటుమీద వరకు వేసిన డబుల్‌లైన్ తారు రోడ్డు

కోడూరు: దివిసీమలోని తీరప్రాంతంలో రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోడూరు–నాగాయలంక మధ్య రూ.16 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి . గత ఏడాది జూన్ నెలలో కోడూరు–నాగాయలంక రహదారి నిర్మాణ పనులు కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. కోడూరు వంతెన సెంటర్ దగ్గర నుంచి పోటుమీద గ్రామం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

ఈ గ్రామాలను కలుపుతూ..

యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, జరుగువానివాపాలెం, పాదాలవారిపాలెం, మందపాకల, పోటుమీద గ్రామాల మీదగా త రహదారి నిర్మాణం సాగుతుంది.

డబుల్‌లైన్ రహదారిగా విస్తరణ..

కోడూరు నుంచి పోటుమీద వరకు గతంలో కేవలం సింగల్ లైన్ రహదారి మాత్రమే ఉండేది. గతంలో ఈ రోడ్డు పూర్తి గుంతలమయంగా ఉండేది. వర్షం వస్తే మోకాలు లోతు నీళ్ల నిలిచేవి. ప్రస్తుతం పాత రోడ్డును మొత్తం తొలగించి నూతన రోడ్డును కాంట్రాక్టు సంస్థ నిర్మిస్తోంది. విస్తరణ పనులను చకచకా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కోడూరు నుంచి పోటుమీద వరకు విస్తరణ పనులను నిర్వహించారు. మార్జిన్‌లో బుసకను కూడా నింపారు.

పూర్తయిన సీసీ రోడ్ల నిర్మాణం..

యర్రారెడ్డివారిపాలెం నుంచి ఇస్మాయిల్‌బేగ్‌పేట చెరువు వరకు డబుల్ లైన్ సీసీ రోడ్డు, మందపాకల గ్రామంలో మరో సీసీ రోడ్డు నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. ఈ రోడ్లను అనుసంధానం చేస్తూ తారు రోడ్డు నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రహదారుల మార్జిన్ వెంట డ్రెయినేజీ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్ పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

తీరప్రాంత ప్రజలకు ఎంతో మేలు..

కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత ప్రజలకు ఈ రహదారి నిర్మాణం వల్ల ఎంతో మేలు చేకూరనుంది. నాగాయలంక మండల ప్రజలు జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు దగ్గర మార్గం అవుతుంది. సుమారు 15కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది. ఇప్పటికే వక్కపట్లవారిపాలెం వద్ద ఓఎన్‌జీసీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. త్వరలో గుల్లమొద వద్ద క్షిపణి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో ఈ రహదారి ఉపయోగపడనుంది.

మరో నెల రోజుల్లో...

కోడూరు–నాగాయలంక రోడ్డు పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ఇప్పటికే 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు



గతంలో సింగిల్ లైన్ గతుకుల రహదారితో నానా ఇబ్బందులు పడ్డాము. కానీ ఇప్పుడు రహదారి విశాలంగా నిర్మించారు. రహదారి కష్టాలు లేకుండా ప్రభుత్వం మాకు ఎంతో మేలు చేసింది. రోడ్డు వెడల్పు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఉండవు.

–కడవకొల్లు సాంబశివరావు, మందపాకల

దూరం తగ్గుతుంది



కోడూరు–నాగాయలంక మధ్య గతంలో ఉన్న రోడ్డు తొలగించి మళ్లీ కొత్త రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల జిల్లా కేంద్రమైన మచిలీపట్నం దగ్గర మార్గం ఏర్పడింది. మత్స్యసంపదను, రైతులు తమ పంటను మచిలీపట్నంకు తరలించేందుకు ఈ రోడ్డు చాలా ఉపయోగం.

–పరిశె భిక్షాలు, పాదాలవారిపాలెం

అట్టడుగు వర్గాలకు పదవులు సీఎం జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఎస్సీ, బీసీ నాయకులు

మచిలీపట్నంటౌన్: చట్టసభల్లో అట్టడుగు వర్గాల వారికి అవకాశం కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని వైఎస్సార్ సీపీ ఎస్సీ, బీసీ నాయకులు ఉద్ఘాటించారు. 14 మంది ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన నాయకులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించటం పట్ల సీఎం జగన్‌కు మంగళవారం వారు కృతజ్ఞతలు తెలిపారు. నగర డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో బీసీల్లో డబ్బున్న బడాబాబులకే పదవులు ఇచ్చేవారన్నారు. అయితే సీఎం జగన్ ఆ వర్గాల్లోని పేదలను సైతం ఉన్నత రాజ్యాంగ పదవుల్లో నియమించి మనసున్న ముఖ్యమంత్రిగా గుర్తించబడ్డారన్నారు. సీఎం జగన్ తీసుకుంటున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాలను ఆయా వర్గాల ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్లు కాగిత జవహర్‌లాల్, ఏకశిరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు బూరగ రామారావు, చీలి చక్రపాణి, ధనికొండ శ్రీనివాసరావు, తరకటూరు సీతారాముడు పాల్గొన్నారు.

పథకాలు ఆదుకుంటున్నాయి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో లబ్ధిదారులు
- మోపిదేవి సచివాలయం–1లో గడప గడపకు మన ప్రభుత్వం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



టీడీపీ మాజీ కౌన్సిలర్ భాస్కరరావు సతీమణి పార్వతితో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మోపిదేవి: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తమ కుటుంబాలను ఆదుకుంటున్నాయని పలువురు లబ్ధిదారులు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఎదుట పేర్కొన్నారు. మోపిదేవి గ్రామ సచివాలయం–1లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 360 గృహాలను సందర్శించి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎమ్మెల్యేలను ఇంటింటా తిరిగి సమస్యలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పేద ప్రజల మనోభావనను తెలుసుకుని వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడానికి గడప గడపకు కార్యక్రమం చేపట్టామన్నారు. మాసైన్యం 8 లక్షలు మందితో రాష్ట్ర మంతా మార్చి 18 నుంచి 25 లోపు గడప గడపకు గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో పర్యటించి జగనన్నను మరోసారి దీవించాలని కోరతామన్నారు. ప్రతి ఇంటా జగనన్న మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. డ్రైనేజీ, తాగునీరు, అంతర్గత రోడ్ల సమస్యలు కూడా పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, గ్రామ పార్టీకన్వీనర్ కారుమూరి తాతయ్య, పీఏసీఎస్ చైర్ పర్సన్ రావి రామప్రసాద్, కామిశెట్టి వెంకట సురేష్ బాబు, కేసగాని రాంబాబు, పలుగ్రామాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హతే గీటురాయిగా సంక్షేమ పథకాలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అర్హతే గీటురాయిగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నగరంలోని 24వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్‌సలార్‌దాదా, ఆ డివిజన్‌కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జ్ చిత్తజల్లు రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. నవరత్న పథకాల్లో తనకు వైఎస్సార్ పింఛను కానుక రూ.82 వేలు, ఇంటిస్థలం, పక్కా ఇల్లు మంజూరైందని ఆ ప్రాంతానికి చెందిన గోలి లక్ష్మీనరసమ్మ కిట్టుకు తెలిపింది.

టీడీపీ మాజీ కౌన్సిలర్‌కు నవరత్నాల లబ్ధి..

టీడీపీ మాజీ కౌన్సిలర్ కోనేటి భాస్కరరావుకు నవరత్న పథకాల ద్వారా రూ.1,11,193లు లబ్ధి చేకూరింది. ఈ వివరాల బుక్‌లెట్‌ను భాస్కరరావు సతీమణి పార్వతికి అందజేశారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ బలగం విజయశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు బూరగ రామారావు, చీలి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం అందిస్తున్న జగన్

మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి

కృత్తివెన్ను: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని అందించడంతోపాటు గడప, గడపకు సంక్షేమాన్ని అందిస్తున్న మహోన్నతవ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వేస్తున్న అడుగులో అడుగు వేద్దామని రాష్ట్ర గృహ నిర్మాణా శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం కృత్తివెన్నులో ఏర్పాటు చేసిన గృహసారధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ తరగతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అమరావతి అనేది చంద్రబాబు సామాజిక వర్గం, టీడీపీ నాయకులు, తాబేదారులకు మాత్రమే అభివృద్ధి జరుగుతుందని, అందుకే అమరావతిపై చంద్రబాబు ఎనలేని తపన పడుతున్నారని విమర్శించారు. ఎంపీపీ కె. గరుడ ప్రసాదు, జెడ్పీటీసీ ఎం.రత్నకుమారి, మంత్రి తనయుడు జోగి రాజీవ్, సచివాలయాలు, వ్యవసాయశాఖల మండల కన్వీనర్లు కొక్కిలిగడ్డ బాబ్జి, వి.బాబూరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

చల్లపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు మచిలీపట్నం రవాణా శాఖ అధికారి మహమ్మద్ ఎల్.సిద్దీఖ్ తెలిపారు. మంగళవారం జాతీయ రహదారి 216పై ప్రమాదాల నివారణకు అనుబంధ శాఖలతో కలిసి మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారి పరిశీలించారు. స్థానిక పెదకళ్లేపల్లి రోడ్డు జంక్షన్‌లో హైవే వద్ద ప్రమాద పరిస్థితులను సమీక్షించారు. ఇక్కడ రోడ్డు దాటుతూ ఇప్పటికి ముగ్గురు మృతి చెందారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై సిద్దీఖ్ మాట్లాడుతూ హైవేపై ప్రమాదాల నివారణకు రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, హైవే అథారిటీ, పోలీస్ శాఖ, ఆర్టీసీ అధికారులతో కలిసి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించేందుకు కృత్తివెన్ను నుంచి మోపిదేవి వరకు వరకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారి జంక్షన్లు పరిశీలించామన్నారు. ఏతఈ అభిషేక్ కుమార్, చల్లపల్లి ఎస్ఐ సీహెచ్.చినబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థిని ఎంపిక

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని తలగడదీవి జెడ్పీహైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని కమతం హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు అన్నపరెడ్డి రామారావు తెలిపారు. ఈనెల 20వ తేదీన మచిలీపట్నం లేడీయాంప్తిల్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో హర్షిత ప్రదర్శన పది ఉత్తమ ప్రదర్శనలో ఒకటిగా ఎంపికైంది. 25 మండలాల నుంచి మొత్తం 131 ప్రదర్శనలు రాగా, వీటిలో ఉత్తమ మైన వాటిని పదింటిని ఎంపిక చేశారు. హర్షిత ప్రదర్శించిన మైక్రో ప్లాస్టిక్‌ని నీటి నుంచి తొలగించే విధానం పలువురుని ఆకట్టుకుంది. డీఈవో తెహెరా సుల్తానా మెమెంటో అందజేసి అభినందించారు. హర్షితకు ఉపాధ్యాయులు కొమ్మినేని ఉదయ్‌కుమార్ గైడ్‌లైన్స్ ఇచ్చారు. ఈనెల 28న విజయవాడ లయోలా కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో హర్షిత పాల్గొననుంది. హెచ్ఎం రామారావు, ఇన్‌చార్జి హెచ్ఎం పద్యాల రఘురామయ్య, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వర్రే రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ పాకారపు సురేష్, స్టాఫ్ సెక్రటరీ మద్దాల సుబ్బారావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థి ప్రతిభ



బాలమణికంఠను అభినందిస్తున్న హెచ్ఎం ఉపాధ్యాయులు

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లపరాజుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గండు బాలమణికంఠ ఏర్పాటు చేసిన 'సాఫ్ట్‌వేర్ యాప్స్' అంశానికి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించిందని హెచ్ఎం ఈ.మధుమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో మణికంఠ మిస్సైల్స్‌లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ టెక్నాలజీకి సంబంధించిన యాప్స్‌ను తయారు చేసి ప్రదర్శించాడు. ఈ ప్రాజెక్టుకు జిల్లా విద్యాశాఖాధికారులు ద్వితీయ బహుమతి ప్రకటించి మణికంఠను అభినందించారు. జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. జిల్లా స్థాయిలో బహుమతి అందుకుని పాఠశాలకు గుర్తింపు తెచ్చిన బాలమణికంఠను, గైడ్ చేసిన సైన్స్ టీచర్ అరుణకుమారిని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, హెచ్ఎం ఎంఎం.రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ పి.సావిత్రి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

వైభవంగా ముగిసిన వార్షిక పూజలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వాల్మీకం (పుట్ట) వద్ద గత నాలుగు రోజులుగా జరుగుతున్న 3వ వార్షికోత్సవ పూజలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట వద్ద ఈ నెల 18వ తేదీ నుంచి వార్షికోత్సవ పూజలు వక్కపాటి ఆంజనేయులు, వెంకటేశ్వరరావు దంపతుల దీక్షధారణలతో జరిగాయి. ముగింపు సందర్భంగా ఆసూరి రంగనాధాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, సుబ్రహ్మణ్య హోమం అనంతరం పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

స్వామివారి ఊరేగింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామివారిని గజవాహనంపై సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శంకరమంచి విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్.. నిత్యబలిహరణ అనంతరం జమ్మి వృక్షపూజ అనంతరం ధ్వజ అవరోహణ కార్యక్రమం నిర్వహిచారు. ఆలయ అధికారులు వెంకట రమణ, గుమ్మడి వెంకటేశ్వరావు, చెన్నకేశవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాంచారమ్మ గ్రామోత్సవం ప్రారంభం

- 15 రోజుల పాటు సాగనున్న ఊరేగింపు
- మార్చి 6,7 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడి సంబరం



చిన్నఅమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని దేవదాయశాఖ అధికారులు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన కొండవీటి వంశీయులు తొలిపూజలు చేసి ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి పుట్టింటివారిగా చెప్పబడే గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన భక్తులు నాంచారమ్మకు నైవేద్యాలు సమర్పించారు. ప్రధానార్చకుడు ఘంటసాల జైపార్థసారథి మంత్ర వచనాల మధ్య రామినీడు ఉత్సవాన్ని జరిపారు. అనంతరం చిన్నఅమ్మవారి గర్భాలయం నుంచి బయటకు తీశారు. అన్నం రాశిని సమర్పించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఊరేగింపుగా చిన్నఅమ్మవారి కొండవీటి వంశీయుల ఇళ్లకు తీసుకువెళ్లి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి హారతులు పట్టారు. యువకులు కత్తి, కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేశారు. 15 రోజుల పాటు విశ్వనాథపల్లి, కుమ్మరిపాలెం, వి.కొతపాలెం, గాబ గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని ఆలయ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి చెప్పారు. మార్చి 6,7 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడిజాతర, 8న తిరిగి చిన్నఅమ్మవారి ఆలయ ప్రవేశంతో జాతరోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఆలయ చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు మాదాసు వెంకటేశ్వరరావు, బాదర్ల సాంబయ్య, పెడసనగంటి నాగరణి, నిడదవోలు కృష్ణలీల, ధూళిపూడి కృష్ణకుమారి, పెనుమాక నాగసుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సవ మూర్తుల ఊరేగింపు..



కృత్తివెన్ను: కృత్తివెన్ను శివారు గుడిదిబ్బ గ్రామంలో దుర్గాపార్వతి సమేత నాగేశ్వర స్వామి, రమా సహిత సత్యనారాయణస్వామి వార్ల గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి గుడిదిబ్బ గ్రామ పుర వీధుల్లో మేళతాళాలు, చిత్రవిచిత్ర వేషధారణలతో ఊరేగించారు. కళాకారులు ప్రదర్శించిన వివిధ రకాల నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు స్థానిక గ్రామ పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు.